అధికారం కోసం అబద్ధపు హామీలు



వెన్నుపోటు దినం ర్యాలీలో రాజన్నదొర తోపాటు పాల్గొన్న నాయకులు కార్యకర్తలు

- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం నిరసన
- స్వచ్ఛందంగా తరలివచ్చిన అశేషజనం

సాలూరు రూరల్: ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ప్రజలపక్షాన బుధవారం చేపట్టిన వెన్నుపోటుదినం నిరసన కార్యక్రమాన్ని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని దాదాపు 4 వేల మంది వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు. నిరసన ర్యాలీ రాజన్నదొర ఇంటినుంచి ప్రారంభమై ఆర్టీసీ బస్‌స్టాండ్ మీదుగా జాతీయ రహదారి గుండా బోసుబొమ్మ కూడలి వరకు సాగింది. అక్కడ దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి రాజన్నదొర పూలమాల వేసి నివాళి అర్పించారు అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా బడుగు బలహీన వర్గాలతో ఆడుకుంటోందన్నారు. గత ప్రభుత్వంలో ఈ పాటికే రైతులకు పెట్టుబడి సాయం అందేదని ఇప్పుడు రైతులు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టాల్సి వస్తోందన్నారు. రూ.20వేలు రైతు సాయం ఎప్పుడు ఇస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే తల్లికి వందనం అంటూ నీకు రూ.15వేలు, నీకు రూ.15వేలు అంటూ డైలాగులు కొట్టిన లోకేష్ ఇప్పుడు రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అవలు చేయడంలో బిజీ అయిపోయారని ఎద్దేవా చేశారు. స్థానిక మంత్రి సంధ్యారాణి ఫ్లెక్సీల విషయంలో కేసులు పెట్టించే పనిలో ఉన్నారని ఆరోపించారు. కూటమి పాలనలో అధికారులు రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అనుసరించకుండా అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అనుసరించాలని హితవు పలికారు.



రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర

ఉద్యోగులకు ఉసురు

అధికారం కోసం అబద్ధాలు చెప్పి ఇప్పుడు పేదల గోడు ఏమీ పట్టనట్లు ఇష్టానుసారం పరిపాలన సాగిస్తున్నారని ధ్వజమెత్తారు. అలాగే ఉద్యోగులకు టీఏ లేదు, డీఏ లేదు వారికి ఇవ్వాల్సిన రూ.20 వేల కోట్ల బకాయిలు చెల్లించకుండా ఉసురు పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి అని చెప్పి నిరుద్యోగుల ఆశలతో ఆడుకున్న ఘనత చంద్రబాబుదేనన్నారు. తల్లికి వందనం, ఉచిత బస్సు, ఉచిత గ్యాస్ అంటూ మహిళల ఆత్మగౌరవాన్ని దెబతీసిన చంద్రబాబుది వెన్నుపోటు కాదా? అని ప్రశ్నించారు. నమ్మించి మోసం చేసి ప్రభుత్వాన్ని వెన్నుపోటు ప్రభుత్వంగా ప్రజలే చెప్పుకుంటున్నారన్నారు.

అప్పుల ఆంధ్రప్రదేశ్ ఘనత చంద్రబాబుదే

ఒక్క ఏడాదిలోనే లక్షా ఏభైవేల కోట్లు అప్పులుచేసి అప్పుల ఆంధ్ర ప్రదేశ్‌గా తీర్చిదిద్దిన ఘనత చంద్రబాబు సొంతం చేసుకున్నారని ఆరోపించారు. సంపద సృష్టిస్తానని ప్రజలపై పన్నులు భారం, కరెంటు చార్జీలు పెంచి ప్రజలనుంచి డబ్బులు వసూలు చేసి అదే సంపద సృష్టిగా చూపించడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్యేనన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మక్కువ నాయకులు రంగునాయుడు, శ్రీనివాసులునాయుడు, పాచిపెంట నాయకులు ముత్యాల నాయుడు, అప్పలనాయుడు, సాలూరు మండల నాయకులు రెడ్డి సురేష్, రామకృష్ణ, దండి శ్రీను, బీసు, పట్టణ నాయకులు గిరిరఘు, వంగపండు అప్పలనాయుడు, గుల్లిపల్లి నాగ , మెంటాడ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఏడాదిగా కూటమి కుట్రలు



పట్టణంలో ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

- సూపర్ సిక్స్ హామీలిచ్చి దగా
- ప్రభుత్వ వైఫల్యలాకు నిరసనగా వెన్నుపోటు దినం
- మాజీ ఎమ్మెల్యే జోగారావు ఆధ్వర్యంలో కార్యక్రమం

పార్వతీపురంటౌన్: కూటమి ప్రభుత్వం ఏడాది కాలంగా మోసాలు, అమలు కాని హామీలనిచ్చి, మేనిఫెస్టోలో పొందుపరిచిన 143 హామీలు అమలు చేయకుండా ప్రజలను తీవ్రంగా మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు మండిపడ్డారు. ఈ మేరకు గురువారం వైఎస్సార్‌సీపీ పిలుపునిచ్చిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమం సందర్భంగా పట్టణంలోని వైఎస్సార్ కూడలి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపిన తరువాత జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్ శోభికకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు, ప్రజల సంక్షేమాన్ని ఏమాత్రం పట్టించుకోని దుర్మార్గమైన పాలన అందిస్తున్నారన్నారు. దేశచరిత్రలో ఇటువంటి పాలనను ఎప్పుడూ చూడలేదని వ్యాఖ్యానించారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం తన ఏడాది పాలనలో నిరంకుశ, అరాచక విధానాలను ప్రజలకు పరిచయం చేసిందని విమర్శించారు.



జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్ శోభికకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

తొలి ఏడాదిలోనే రాష్ట్రంపై అప్పల భారం

చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తొలి ఏడాదిలోనే రాష్ట్రంపై రూ.1.49 లక్షల కోట్ల అప్పుల భారం మోపారని, ఆ సొమ్మును దేనికి వినియోగించారో తెలియడం లేదని మాజీ ఎమ్మెల్యే జోగారావు అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించకుండా ఉండేందుకు రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని ఆరోపించారు.



రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువు

కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలోని మహిళలకు రక్షణ కరువైంది. మహిళలకు సంక్షేమ పథకాలు అందడం లేదు. తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఆడబిడ్డ నిధి అన్నారు. ఏడాది గడుస్తున్నా పథకాల ఊసేలేదు. తక్షణమే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ప్రభుత్వం అమలు చేయాలి. – సునీత, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి



అన్ని వర్గాల వారికి అన్యాయం

కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల వారికి అన్యాయం జరుగుతోంది. 18–59 ఏళ్ల మధ్య ఉన్న ప్రతి మహిళకు నెలకు రూ.15 వేలు చొప్పున ఏడాదికి రూ.18 వేలు ఇస్తామన్నారు. 50 ఏళ్ల దాటిన బీసీ, ఎస్సీ మైనార్టీల వారికి నెలకు రూ.4 వేల పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చి పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం అందరినీ ఆదుకోవాలి. – గుడివాడ నాగమణి, ఎంపీపీ బలిజిపేట



అలవి కాని వాగ్దానాలతో మోసం

కూటమి అలవి కాని వాగ్దానాలు చేసి ప్రజలను మోసం చేస్తోంది. తల్లికి వందనం అన్నారు. తల్లికి పంగనామం పెట్టారు. నిరుగ్యోగ భృతి అని నిరుద్యోగులను మోసం చేశారు. ఏడాది కాలంలో అన్ని వర్గాల వారికి అన్యాయం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్తారు. – మజ్జి శోభారాణి, ఎంపీపీ, పార్వతీపురం

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ములగ పోలమ్మ వారోత్సవాలు



గ్రామదేవత వారోత్సవాలను నిర్వహిస్తున్న ములగ గ్రామస్తులు

పార్వతీపురం రూరల్: మండలంలోని ములగ గ్రామంలో వెలసిన గ్రామదేవత ములగపోలమ్మ వారాలను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో మంగళవారం ఘనంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాలతో ములగ గ్రామంలో ఉన్న పలు ప్రధాన వీధుల్లో అమ్మవారిని ఊరేగించి భక్తిని చాటుకున్నారు. అనంతరం గ్రామస్తులు కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి గ్రామ ప్రారంభంలో ఉన్న పాటిపాలెం ప్రాంతానికి వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. పండగ వాతావరణంలో ఘనంగా ములగపోలమ్మ వారోత్సవాలను గ్రామస్తులంతా నిర్వహించారు.

దేవాలయాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు దరఖాస్తుల స్వీకరణ



బ్రాహ్మణ సమాఖ్య రాష్ట్రప్రచార కార్యదర్శి గన్నవరపు శ్రీనివాస్

సీతానగరం: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పట్టణ, గ్రామీణ ప్రాంతాల దేవాలయాల్లో చోరీలు జరుగుతున్న కారణంగా చోరీల నివారణకు దేవదాయశాఖ పటిష్టమైన భద్రత ఏర్పాట్లకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని రాష్ట్ర బ్రాహ్మణ సమాఖ్య ప్రచార కార్యదర్శి గన్నవరపు శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు మండలకేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడుతూ దేవదాయ వ్యవస్థను పటిష్ట పర్చడానికి రాష్ట్రంలోని దేవాలయాల్లో నిఘా కెమెరాలు ఏర్పాటు చేయడానికి అర్జీలు స్వీకరిస్తున్నట్లు తెలియజేశారు. అలాగే ఏడాదిలో రూ.5 లక్షల ఆదాయానికి తక్కువగా ఉన్న అన్ని దేవాలయాలకు ధూప, దీప నైవేద్యం పెట్టడానికి ఆర్థిక సహాయం నిమిత్తం దరఖాస్తులను దేవదాయ శాఖ ఆహ్వానిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకునేందుకు రాష్ట్రవ్యాప్తంగా సమీపంలో ఉన్న బ్రాహ్మణ సమాఖ్య ప్రతినిధులను సంప్రదించాలని, నేరుగా అయినా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మధ్యాహ్న వంటల్లో నాణ్మత పాటించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: 2025–26 విద్యాసంవత్సరం పునఃప్రారంభించే సమయం ఆసన్నమవడంతో మండలంలోని పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులు విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంపీడీఓ ఎంఎల్ఎస్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహకులతో ఎంఈఓ–2 ఎం వెంకటరమణ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు జరిగింది.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

పార్వతీపురం రూరల్: మండలంలో శుక్రవారం విద్యుత్ పునరుద్ధరణ, మరమ్మతుల కారణంగా నర్సిపురం, తాళ్లబురిడి సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతుందని పార్వతీపురం మండల విద్యుత్ శాఖ ఏఈ రామారావు పేర్కొన్నారు. ఈ మేరకు 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు స్పష్టం చేశారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఈదురు గాలుల ప్రభావంతో నేలకొరిగిన చెట్లు



నారాయణపురం రోడ్డులో నేలకొరిగిన చెట్లు

బలిజిపేట: ఈదురు గాలుల ప్రభావంతో బలిజిపేట నారాయణపురం రోడ్డులో నారాయణపురం గ్రామసమీపంలో చెట్లు నేల కొరిగి రాకపోకలకు అంతరాయం కలిగించాయి. మండలంలో బుధవారం సాయంత్రం ఈదురుగాలులలో కూడిన వర్షం పడింది. దీని ప్రభావంతో నారాయణపురం సమీపంలో రోడ్డు పక్కనే ఉన్న చెట్లు నేలకొరగడంతో కొంతమేర విద్యుత్ వైర్లు తెగినట్లు గ్రామస్తులు తెలిపారు. దీంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. గ్రామంలో శ్రీశ్రీశ్రీ బంగారమ్మ తల్లి ఆలయ పునఃప్రతిష్ట మహోత్సవం జరుగుతుండడంతో గ్రామస్తులు ఏకమై చెట్లను తొలగించారు. విద్యుత్ వైర్లను సరిచేయించినట్లు చెప్పారు. అదృష్టవశాత్తు ఎటువంటి ప్రమాదం సంభవించలేదన్నారు.

ఎండీయూ ఆపరేటర్లను విధుల్లోకి తీసుకోవాలి

సాలూరు రూరల్: ప్రజలకు నిత్యావసర సరుకులు అందించి ఎనలేని సేవలందించిన ఎండీయూ ఆపరేటర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర ఆధర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం నియెజకవర్గంలో ఎండీయూ ఆపరేటర్లు రాజన్నదొరను కలిసి తమ కష్టాలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఆపరేటర్లను ఉద్దేశించి రాజన్నదొర మాట్లాడుతూ ఎండీయూ ఆపరేటర్లను నియమించిన జగనన్న ప్రభుత్వం పేద ప్రజలకు ఎంతో మేలు చేసిందన్నారు. ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందించి నిరుపేదలు, వృద్ధులకు ఎంతో మేలు చేసిందన్నారు. ప్రస్తుతం ఎండీయూ వాహనాలతో పాటు ఆపరేటర్లను తొలగించడంతో దూర ప్రాంతాలకు వెళ్లి రేషన్ తీసుకుని మోసుకుని వెళ్లలేక మహిళలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బడుగు బలహీన వర్గాలకు మేలు చేసే జగనన్న పథకాలను నిలుపుదల చేసి పేదలకు అన్యాయం చేయడంలో చంద్రబాబు వెన్నుపోటు రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు.



ఎండీయూ ఆపరేటర్లతో మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

టీబీ నిర్మూలనే లక్ష్యంగా పనిచేద్దాం



నారాయణపురంలో ర్యాలీ చేస్తున్న వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి, ప్రజలు

బలిజిపేట: టీబీ నిర్మూలనే లక్ష్యంగా కలిసి పనిచేయాలని బలిజిపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి పిలుపునిచ్చారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నారాయణపురంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధిగ్రస్థులు ఉండే ఇళ్లలో, ఆ ప్రాంతంలో ప్రజలందరికీ ఉమ్మి తనిఖీ చేసి అనుమానిత వ్యక్తులందరికీ ఉమ్మి తనిఖీతో పాటు ఎక్స్‌రే కూడా ఉచితంగా తీసి వేగంగా క్షయవ్యాధిని గుర్తించనున్నట్లు చెప్పారు. క్షయ వ్యాధి నిర్మూలన కోసం వందరోజులు ఆశ, వైద్యసిబ్బంది సర్వే చేస్తారని తెలిపారు. దీని ఆధారంగా వైద్యసేవలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగో రోజూ రేషన్ తిప్పలు



భుజంపై మోస్తూ వరుస క్రమంలో తమ గ్రామానికి బయల్దేరిన గిరిజన గ్రామాల ప్రజలు



నెత్తిన మోయలేని బరువుతో అవస్థలు పడుతున్న గిరిజన వృద్ధురాలు



దోకిశీల డిపో నుంచి సైకిల్‌పై గ్రామానికి చేరేందుకు ఇలా..

- జీవనోపాధి పక్కనబెట్టి పడిగాపులు
- పేదలను రోడ్డు పాలు చేసిన కూటమి సర్కారు
- ఇది పేదలపై కక్ష్ సాధింపే: సీపీఎం నాయకులు

పార్వతీపురం రూరల్: కాళ్లు కదపకుండా ఇంటి వద్దకే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదలకు అన్నమదించే ఆలోచనతో ఎండీయూ వాహనాలతో రేషన్ సరుకులు సరఫరా చేస్తే.. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పేదలను, బలహీనవర్గాలను రేషన్ సరుకుల కోసం డిపోల వద్దకు రప్పిస్తూ అనేక అవస్థలకు గురిచేస్తోంది. పార్వతీపురం మండలంలోని గంగపురం, డోకిశీల తదితర పంచాయతీల పరిధిలో అనేక గిరిజన గ్రామాలు ఉన్నాయి. కుటమి సర్కారు ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దకే రేషన్ సరఫరాను నిలిపివేయడంతో దాదాపు 10 నుంచి 5 కిలోమీటర్ల వ్యవధి దూరంలో ఉన్న ఆయా గిరిజన గ్రామాల గిరిజనులు తీవ్రస్థాయిలో అవస్థలు ఎదుర్కొంటున్నట్లు పార్వతీపురం మండల సీపీఎం నాయకుడు పి.రాము ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం 7 గంటలకే రేషన్ డిపోల వద్దకు రావాలని డీలర్లు ఆయా గిరిజన గ్రామాల ప్రజలకు సమాచారం అందించడంతో రేషన్ బియ్యం కోసం వేకువజామున తమ గ్రామాల నుంచి ఉదయం నాలుగు గంటలకు బయల్దేరి పంచాయతీలో ఏర్పాటు చేసిన రేషన్ డిపోలకు ఉదయం ఏడు గంటలకు చేరుకుని పడిగాపులు కాస్తూ రేషన్ బియ్యం కోసం తీవ్రస్థాయిలో ఇక్కట్లు ఎదుర్కొంటున్నట్లు ఆయన తెలిపారు. గత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి హయాంలో పేదలకు ఆసరా ఇచ్చే విధంగా ఇళ్లకే రేషన్ సరుకులు అందించే సేవల వ్యవస్థను మరింత మెరుగుపరచాల్సింది పోయి. పేదలపై కక్ష సాధింపు చర్యగా బలహీన వర్గాలకు ఉపయోగపడే ఇలాంటి సేవలను రద్దుచేసి వారిని రోడ్డుపాలు చేయడం సరికాదన్నారు. తమ జీవన ఉపాధిని మానుకుని రోజంతా రేషన్ కోసం వెచ్చించి పడిగాపులు కాస్తూ పేదలు, గిరిజనులు బలహీన వర్గాలు అనేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నట్లు ఆయన తెలిపారు.



లబ్ధిదారుల అవస్థలను తెలుసుకుంటున్న సీపీఎం నాయకుడు పి.రాము



మండుటెండలో గంగపురం రేషన్ డిపో వద్ద నిరీక్షణ

'మధ్యాహ్న' నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలి

సీతానగరం: మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఏడాది కాలంగా ఎదుర్కొంటున్న న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలని మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి వై శాంతికుమారి అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో సీఐటీయూ మండల కార్యదర్శి ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శాంతికుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకంలో అనేకమైన మార్పులు చేసి పనిభారం పెంచిందన్నారు. పనికితగిన వేతనం ఇవ్వడం లేదని, రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర సరుకులు, వంటసామగ్రికి అనుగుణంగా ధరలు పెంచాలని కోరారు. దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంఈఓ–2 ఎంవి రమణకు అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల నాయకులు ఎస్.లక్ష్మి, సీహెచ్ ఆదిలక్ష్మి, సావిత్రి, రుమారమ్మ, పాల్గొన్నారు.



ఎంఈఓ వెంకటరమణకు వినతిపత్రాన్ని అందచేస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులు

ఉపాధి వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలి

- కాంగ్రెస్ పార్టీ నాయకుల డిమాండ్



ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

పార్వతీపురం రూరల్: ఉపాధి హామీ వేతనాల బకాయిలను తక్షణమే చెల్లించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా చైర్మన్ వంగల దాలినాయుడు మండలంలోని సాకి గెడ్డ కాలువ పనులు చేస్తున్న బందలుప్పి గ్రామానికి చెందిన ఉపాధి హామీ వేతనదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ కార్యాచరణలకు తూట్లు పొడుస్తూ వేతనదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. వేసవిలో పనులు లేక అల్లాడిన ప్రజలకు పని కల్పించేందుకు ఆసరా కల్పించేందుకు గొప్పగా తెచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని నీరు గార్చే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఎనిమిది వారాలుగా వేతనదారులకు ఉపాధి హామీ బిల్లులు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సిరిసిపల్లి సాయి శ్రీనివాస్, తీళ్ల గౌరీ శంకరరావు, గేదెల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్

పార్వతీపురం రూరల్: పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్ పాల్ రైతులకు సూచించారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, కేవీకే రస్తాకుంటుబాయి ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభయాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని డోకిశీల గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరిలో సమగ్ర యాజమాన్య పద్ధతులు, పచ్చి రొట్ట పంటలగురించి , మొక్కజొన్న, చిరుధాన్యాలలో యాజమాన్య పద్ధతులు, ఆయిల్ పాం, జీడి తోటలలో అంతర పంటలు, నవధాన్యాలలో యాజమాన్య పద్ధతులపై ప్రకృతి వ్యవసాయం, జీవన ఎరువులపై కేవీకే శాస్త్రవేత్త డా.ఎస్.దుర్గా, ఉద్యాన విభాగం డా.ఎస్.శ్రీనివాస్ రాజ్, ఐసీఏఆర్ శాస్త్రవేత్త కె.విశ్వానాథ రెడ్డి జిల్లా ఉద్యాన శాఖ అధికారి శైలజలు రైతులకు వివరించారు. కార్యక్రమాల్లో డీఆర్‌సీ కోర్డినేటర్ ఆర్.శ్రీనివాస్, ఏడీఏ వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయాధికారి ఎం.అశోక్, సీడ్స్ డీఎం డా.పద్మ, మార్క్‌ఫెడ్ డీఎం విమలతోపాటు ఆయాగ్రామాల రైతులు పాల్గొన్నారు.



దోకిశీలలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్